
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
శుక్రవారం 21 జూన్ 2024

రెండు వైపులా తెలుగు, ఆంగ్లంలో ముద్రించిన పాఠ్యపుస్తకం



పాఠ్యాంశం సులభతరం

- విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా సర్కారు కృషి
- ఒకే పుస్తకంలో తెలుగు, ఆంగ్ల భాషల్లో పాఠాలు
- ఈ ఏడాది 'పది' విద్యార్థులకూ ద్విభాషా పుస్తకాలు
- గ్రామీణ విద్యార్థులకు మరింత ప్రయోజనం
- జిల్లాలో 508 బడుల్లో 65వేల మంది విద్యార్థులు

జఫర్‌గడ్, జూన్ 20: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లో విద్యనందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. మూడేళ్ల క్రితం ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టింది. ఇలా ఏటా ఒక్కో తరగతిని పెంచుతూ.. ఈ విద్యా సంవత్సరం నుంచి పూర్తిగా పదవ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం బోధించనున్నారు. గతంలో సక్సెక్ పాఠశాలల పేరిట ప్రతి మండలంలో ఎంపిక చేయబడిన కొన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మాత్రమే ఇంగ్లిష్ మీడియం బోధన ఉండేది. 2022-23 విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రారంభించారు. అయితే పాఠ్యాంశాలను ఇంగ్లిష్‌లో ముద్రించడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు సులువుగా అర్థం చేసుకోలేక పోతున్నారని భావించిన విద్యాశాఖ.. గత మూడేళ్లుగా తెలుగు, హిందీ మినహా భాషేతర పుస్తకాలైన గణితం, సామాన్యశాస్త్రం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘీక శాస్త్రం పుస్తకాల్లోన్ని అన్ని పాఠ్యాంశాలను ఆంగ్ల సమేతంగా తెలుగు భాషలో సైతం ముద్రిస్తోంది. గత ఏడాది వరకు ఒకటి నుంచి 9వ తరగతి వరకు ద్విభాషల్లో ముద్రించగా.. ఈ ఏడాది పదో తరగతి పుస్తకాల్లో కూడా ప్రతి పాఠాన్ని తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ముద్రించారు. ఇలా ద్విభాషలో ముద్రించడం వల్ల తెలుగు మీడియం, చదువులో వెనుకబడిన, గామీణ ప్రాంత విద్యార్థులు ఆయా పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకుంటారని, తద్వారా ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని భావిస్తున్నారు. జనగామ జిల్లాలో మొత్తం 508 పాఠశాలల్లో 65,128 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా..


ఇంగ్లిష్ మీడియంలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు విద్యాశాఖ పుస్తకాల్లో పాఠ్యాంశాలను ద్విభాషల్లో ముద్రణకు శ్రీకారం చుట్టింది. పిల్లలు ఆంగ్ల పాఠాలను చదవడంలో, పదాలను అర్థం చేసుకోవడంలో ఇక్కట్లను తొలగించేందుకు, ఆయా పాఠ్యాంశాలపై విషయ నైపుణ్యం పెంచుకునేందుకు పుస్తకాల ముద్రణలో మార్పులు చేపట్టారు. ద్విభాష ముద్రణ వల్ల ప్రాథమిక స్థాయి నుంచి పదో తరగతి వరకు అన్ని పాఠ్యపుస్తకాల్లో రెండు మాధ్యమాల్లో సులభంగా చదువుకునే అవకాశం ఉంది. పదానికి అర్థం తెలియకున్నా.. భాషాపరమైన సమస్యలు ఉన్నా.. పక్కనే ఉన్న పేజీలో తెలుగులో ఉండడంతో అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

పుస్తకాలను రెండు విభాగాలుగా..

తెలుగు, హిందీ మినహా భాషేతర సబ్జెక్టుల్లోని ప్రతి పాఠ్యాంశంలో ఒక పేజీలో తెలుగు, మరో పేజీలో ఇంగ్లిష్‌లో ముద్రించారు. ఈ ఏడాది పదో తరగతికి వర్తింపజేసి ముద్రించిన పుస్తకాలను విద్యార్థులకు అందించారు. అలాగే విద్యార్థులపై పుస్తకాల భారం పడకుండా విద్యాశాఖ జాగ్రత్తలు తీసుకుంది. ప్రతి పుస్తకాన్ని రెండు భాషల్లో ముద్రించడం వల్ల పేజీల సంఖ్య పెరిగి రెట్టింపు బరువు(భారం) అవుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పుస్తకాలను రెండు విభాగాలు చేశారు. సగం పాఠాలను భాగం-1, మిగతా సగాన్ని భాగం-2గా విభజించారు. వీటిని రెండు దఫాలుగా విద్యార్థులకు అందించనున్నారు.

కొత్త హంగులతో పుస్తకాలు

విద్యార్థులకు అందించే పుస్తకాలను కొత్త హంగులతో రూపొందించారు. ఆకట్టుకునే చిత్రాలు, కవర్ పేజీలతో ముద్రించారు. పేజీలోని పూర్తి పాఠం, సంబంధిత వీడియోల కోసం అక్కడ క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. మొబైల్‌తో స్కాన్ చేయగానే అదనపు సమాచారంతో కూడిన వీడియో, ఫొటోలు అందుబాటులోకి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు సరికొత్త ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.



మొదటి భాగం సూచించే పదో తరగతి గణితశాస్త్రం

సులభంగా ఉంది..



- వేముల స్రవంతి, 10వ తరగతి, జడ్పీ హైస్కూల్, కూనూరు

పుస్తకాల్లో ఇంగ్లిష్, తెలుగు రెండు భాషల్లో ముద్రించడం వల్ల పాఠాలను అవగాహన చేసుకునేందుకు సులభంగా ఉంది. ఇంగ్లిష్‌లో అర్థం కాని విషయాలను, పదాలను తెలుగులో చదువుకుని అర్థం చేసుకునేందుకు ఎంతో ఉపకరిస్తుంది. కొన్ని క్లిష్టమైన అంశాలు, కొత్తగా పరిచయమైన పదాలను తెలుగులో ముద్రించడం వల్ల డిక్షనరీలతో అవసరం లేకుండా ఉంటోంది. ప్రస్తుతం పదవ తరగతికి కూడా ద్విభాషా పుస్తకాలు ఇవ్వడం వల్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా చదువుకునే అవకాశం లభించింది.

కరదీపికలుగా నిలుస్తాయి..



- మంగు జయప్రకాశ్, గెజిటెడ్ హెచ్‌ఎం, జడ్పీ హైస్కూల్, హిమ్మత్‌నగర్

రెండు భాషల్లో పాఠ్యాంశాలను ముద్రించడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగపడడమే కాకుండా వారికి కరదీపికలుగా నిలుస్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రారంభించి తదనుగుణంగా పాఠ్యపుస్తకాలను కూడా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఒకే పుస్తకంలో ముద్రించి విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు ఒక పాఠాన్ని, అందులోని కఠిన పదాలను తెలుగులో అర్థం చేసుకుని సులువుగా అధ్యయనం చేయగలరు.

మెరుగైన ఫలితాల సాధనకు దోహదం



- ఎండీ పర్వేజ్, మండల విద్యా నోడల్ అధికారి

ద్విభాషా పాఠ్యాంశాల ముద్రణ వల్ల మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుంది. విద్యాశాఖ తాజాగా రూపొందించిన పాఠ్యాంశాల ముద్రణతో విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా తెలుగు మీడియం, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఈ విధానంతో ఎంతో ప్రయోజనం కలగనుంది. తెలుగు, ఇంగ్లిష్‌లో పాఠ్యాంశాలను ముద్రించడం కారణంగా ఇంగ్లిష్ భాష, ఆయా సబ్జెక్టుల్లో విషయ నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు తోడ్పడుతుంది.

ప్రతీ రైతుకు పథకాలందేలా కృషి



- ఉమ్మడి వరంగల్ రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం
- చైర్మన్ పదవితో బాధ్యత మరింత పెరిగింది
- డీసీసీబీ టర్నోవర్ రూ.870కోట్ల నుంచి రూ.1,931 కోట్లకు తెచ్చా
- 78,432 మంది రైతులకు రూ.529.44 కోట్ల రుణమాఫీ
- పదవుల కోసం పార్టీలు మారే వ్యక్తిని కాదు
- భవిష్యత్తు రాజకీయాల గురించి ఇప్పుడే ఏం చెప్పలేను
- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

వివరాలు 7లో...

'వరంగల్ డీసీసీబీ 107 ఏళ్ల చరిత్రలో తొలిసారి రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి దక్కింది. నాకు వచ్చిన ఈ అవకాశంతో ఓరుగల్లు రైతుల అభివృద్ధికి కృషి చేస్తా. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతీ పథకం చేరేలా దృష్టి పెడతా. ఇప్పటికే కొత్తగా 12 బ్యాంకులను తీసుకొచ్చా. మరో ఐదు కొత్త బ్యాంకుల కోసం ప్రతిపాదనలు పంపించా' అని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. భవిష్యత్తు రాజకీయాలపై ఇప్పుడే ఏం చెప్పలేనని, పదవుల కోసం తాను పార్టీ మారే వ్యక్తిని కాదని, టెస్కాబ్ చైర్మన్ పదవి వస్తుందని కూడా ఊహించలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతులకు మేలు జరుగుతోందంటున్న మార్నేని రవీందర్‌రావు గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ప్రత్యేకంగా ముచ్చటించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఉపాధ్యాయుల నిరసన



మధ్యాహ్నభోజన సమయంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నర్మెట, జూన్ 20 : ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని కోరుతూ గురువారం నర్మెట మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా ఒకే పాఠశాలలో పనిచేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించి బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూక్య వాసు, భూక్య కిష్ట, సునిత, వినోద, సమ్మక్క, సజన్‌లాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలతో రక్తహీనతకు చెక్

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా




విద్యార్థికి అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, జూన్ 20: అల్బెండజోల్ మాత్రలతో రక్తహీనతను అరికట్టవచ్చని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జనగామ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో కలెక్టర్ రిజ్వాన్ బాషా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 01 నుంచి 19 సంవత్సరాలు గల పిల్లలందరు నులిపురుగుల నివారణ మాత్రలను తప్పకుండా వేసుకోవాలన్నారు. నులిపురుగు సంక్రమణ వలన చిన్నారుల్లో రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి లేకపోవడం, విరోచనాలు, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ హరీష్‌రాజ్, డీడబ్ల్యూవో జయంతి, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్, డాక్టర్ రవీందర్, హెచ్‌ఎం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాటానికి సిద్ధం కావాలి

వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న అందె రాంబాబు

జనగామ కల్చరల్, జూన్ 20 : దివ్యాంగులు హక్కుల కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు అందె రాంబాబు అన్నారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని జూబ్లీ గార్డెన్స్‌లో తాళ్లపల్లి కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాంబాబు, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాలె జంగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో పలు అంశాలపై రుణాలు తీసుకొని తమ రాజకీయ ప్రాబల్యం కోసం పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి దివ్యాంగులకు ఇచ్చిన హామీలు కనబడడం లేదా.. అని ప్రశ్నించారు. దివ్యాంగుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ఆరు నెలలు గడుస్తున్నా తమ పాలనలో వికలాంగ మంత్రిత్వ శాఖను, కార్పొరేషన్, దివ్యాంగుల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలు చేపట్టకుండా తీరని అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. కేబినెట్ సమావేశంలో దివ్యాంగులకు రూ.6వేల పింఛన్‌పై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేని పక్షంలో మంద క్రిష్ణమాదిగ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చుట్టుముట్టి రాజకీయ గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో రాగళ్ల ఉపేందర్, గద్దల కిషోర్, పైసా రాజశేఖర్, సందెన రవీందర్, బొట్ల మహేష్, నీర్మాల భాస్కర్, సోమరాజు, ఈగ చక్రపాణి, బిచ్చాల వంశీ, ఇరుగు కృష్ణమూర్తి, తాటికాయల హరికృష్ణ, గువ్వల రవి, తిప్పారపు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి
- కలెక్టరేట్ ఎదుట పార్టీ నేతల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్, జూన్ 20: నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేపట్టి అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి రాత్రింబవళ్లు కష్టపడి చదివి నీట్ పరీక్ష రాస్తే కొంతమంది దళారులు డబ్బులకు ఆశపడి పేపర్ లీకేజీలు చేయడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇలా పరీక్ష నిర్వహించి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడి వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేయవద్దన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నీట్ పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, బూడిద గోపి, జోగు ప్రకాష్, బొట్ల శేఖర్, బోడ నరేందర్, దడిగే సందీప్, ధర్మబిక్షం తదితరులు పాల్గొన్నారు.

నెల్లుట్లలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

లింగాలఘణపురం : ప్రతిష్టాత్మక నీట్ పరీక్షా పత్రాల లీకేజీ ఘటనకు నిరసనగా గురువారం మండలంలోని నెల్లుట్లలో సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి రావుల సదానందం మాట్లాడుతూ నీట్ పరీక్షా పత్రాల లీకేజీ కారణంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన 1.40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. ప్రధాని మోదీ ఇప్పటికైనా విద్యార్థుల జీవితాలతో ఆడుకోకుండా న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పేరబోయిన వీరస్వామి, మాచర్ల కుమార్, చీటూరు ఎల్లయ్య, దామెర రాంచంద్రం, దీకొండ ఆంజనేయులు, చీటూరు రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థపై కడియం ప్రత్యేక దృష్టి

- విస్తృతంగా పాఠశాలల ఆకస్మిక తనిఖీలు
- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
- నేడు కలెక్టరేట్‌లో నియోజకవర్గ పరిధి హెడ్మాస్టర్లతో సమీక్ష



లింగాలఘణపురం మోడల్ స్కూల్‌లో పాఠాలు బోధిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి (ఫైల్)

లింగాలఘణపురం, జూన్ 20: ప్రభుత్వ పాఠశాలలతో పాటుగా కస్తూర్బాగాంధీ, మోడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలల్లో మరింత మెరుగైన విద్యను పెంపొందించేందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి కంకణబద్ధులై ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం 15 రోజులుగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని కస్తూర్బా బాలికా విద్యాలయాలు, తెలంగాణ మోడల్ స్కూళ్లు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలతో పాటుగా జిల్లా పరిషత్ హైస్కూళ్లల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రతీ రోజు నియోజకవర్గంలోని ఏదో ఒక మండలంలో ప్రత్యేకంగా ఆశ్రమ పాఠశాలలను సందర్శించడమే కార్యాచరణగా తీసుకుని మౌలిక వసతులు, విద్యాబోధన, ఉపాధ్యాయుల పనితీరు, భోజన వసతులను పరిశీలించేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ అధికారుల్లో హడలెత్తిస్తున్నారు.

పొలిటికల్ టీచర్‌గా..

కడియం శ్రీహరి రాజకీయ నాయకుల దృష్టిలో ప్రస్తుతం ఒక ఎమ్మెల్యే మాత్రమే.. కానీ, విద్యారంగానికి ఆయన ఓ సమీప బంధువు.. విద్యా వ్యవస్థపై ఆయనది ప్రత్యేక విజన్ కూడా.. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా, భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా, తెలంగాణ ఉప ముఖ్యమంత్రిగా కడియం శ్రీహరి ఏశాఖలో పనిచేసినా కూడా విద్యారంగంపై ఆయనదొక ప్రత్యేక నిఘా ఉంటుందని చాలా మంది విద్యావేత్తలు చర్చించుకుంటుంటారు. రాజకీయ అరంగేట్రానికి ముందు కడియం శ్రీహరి రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేయడం కారణంగా పొలిటికల్ లీడర్‌గానే కాకుండా పొలిటికల్ టీచర్‌గా గుర్తింపును పొంది కార్యకర్తలకు క్రమశిక్షణ పాఠాలను నేర్పుతుండటం ఆయన కెరీర్‌లో ఒక భాగంగా ఉంది. అందుకే కడియం వేసే ప్రతీ అడుగు విద్యారంగం వైపే ముందుకు సాగుతుందని జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు.

అభ్యసనా సామర్థ్యాల పరిశీలన..

సాధారణంగా ప్రతీ రాజకీయ నాయకుడు తన నియోజకవర్గ పరిధిలో ఎక్కడికి వెళ్లినా ఆగ్రామానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలపై మాత్రమే దృష్టి సారిస్తుంటారు. కానీ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాత్రం అభివృద్ధి కార్యక్రమాలతో పాటుగా విద్యారంగం పటిష్టతకు కృషి చేస్తుంటారు. పాఠశాలల ఆకస్మిక తనిఖీలు చేస్తూ ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలిస్తారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని మూల్యాంకనం చేస్తుంటారు. ఇందులో భాగంగానే ఇటీవల లింగాలఘణపురం మండలంలోని మోడల్ స్కూల్, కేజీబీవీలను సందర్శించిన ఎమ్మెల్యే కడియం అధ్యాపకుడిగా మారి విద్యార్థులకు పాఠాలను బోధించారు. భోజన వసతులను పరిశీలించారు. సిబ్బంది ఖాళీలను అడిగి తెల్సుకున్నారు. విద్యార్థులకు ఉన్న మౌలిక వసతులు, సమస్యలను తెల్సుకుని వాటిని పరిష్కరించేందుకు ముందడుగు వేస్తుండటంతో నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలల్లో మెరుగైన విద్య మరింత బలోపేతమవతుందని ప్రజలు ఆశిస్తుండటం గమనార్హం.

నేడు కలెక్టరేట్‌లో సమీక్ష

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్ హెడ్మాస్టర్లతో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో డీఈవో రాము, ఎంఈవోలు, నోడల్ అధికారులు, హెచ్‌ఎంలతో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ తరహా సమావేశాలు జనగామ జిల్లా ఆరంభం నుంచి ఒక్కసారి కూడా జరగకపోవడం గమనార్హం. ఆయా పాఠశాలల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షించనున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి..

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 20: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం జరుగనున్న నేపథ్యంలో ఆయన ముఖ్యమంత్రిని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు గురువారం హనుమకొండలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భోగేశ్వర్ మాట్లాడారు. పాఠశాలల్లో స్కావేంజర్లను నియమించాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, 317 బాధితులకు న్యాయం చేయాలన్నారు. పీఆర్సీ కమిటీని నియమించి పెండింగ్ నాలుగు బిల్లులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, స్వామి, వీరస్వామి, మల్లయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు పథకాలందేలా కృషి

● ఉమ్మడి వరంగల్ రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ● టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

తనకు వచ్చిన అవకాశంతో ఉమ్మడి జిల్లా రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని, ప్రతీ ప్రభుత్వ పథకాన్ని రైతులకు చేర్చే విధంగా దృష్టి పెడతానని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పేర్కొన్నారు. ఇటీవల టెస్కాబ్ చైర్మన్‌గా నియమితులైన ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికిచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు మాట్లాడారు. వరంగల్ డీసీసీబీ 107ఏళ్ల చరిత్రలో తొలిసారి రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి దక్కిందని, ఇప్పటికే కొత్తగా 12బ్యాంకులను తీసుకవచ్చానని, మరో ఐదు కొత్త బ్యాంకుల కోసం ప్రతిపాదనలు పంపించానని వివరించారు. పదవుల కోసం పాకులాడే తత్వం తనది కాదని, తనకు ఈ టెస్కాబ్ చైర్మన్ పదవి వస్తుందని కూడా ఊహించలేదన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : టెస్కాబ్ చైర్మన్ పదవి రావటంపై మీ స్పందన?

మార్నేని రవీందర్‌రావు : వరంగల్ సహకార బ్యాంకుకు 107 ఏళ్ల చరిత్ర ఉంది. ఇప్పటి వరకు రాష్ట్రస్థాయిలో చైర్మన్ పదవి దక్కింది లేదు. సీఎం రేవంత్‌రెడ్డి, వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో టెస్కాబ్ చైర్మన్ పదవి దక్కడం చాలా ఆనందంగా ఉంది. తొలిసారి వరంగల్‌కు వచ్చిన ఈ పదవితో ఓరుగల్లు రైతులకు సాధ్యమైనంత వరకు మేలు చేసేలా ప్రణాళిక రూపొందించుకుంటున్నా. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదు లక్షల మందికి పైగా రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరిలో ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు డీసీసీబీల ద్వారా చేరేలా కృషి చేస్తా.

ఆంధ్రజ్యోతి: చైర్మన్ పదవి వస్తుందనే కాంగ్రెస్‌లోకి వెళ్లారా?

మార్నేని: అసలు టెస్కాబ్ చైర్మన్ పదవిపై ఎప్పుడూ ఆశ కూడా పడలేదు. పదవుల కోసం పార్టీ మారే వ్యక్తిని కాదు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న విధానం నాకు నచ్చింది. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, అమలుకు శ్రీకారం చుడుతున్న దమ్మున్న సీఎం రేవంత్‌రెడ్డి. ఆయన నాయకత్వంలో పని చేస్తే రైతులకు మేలు జరుగుతుందనే ఆశతో కాంగ్రెస్‌లో చేరా. నేను కాంగ్రెస్‌లో చేరిన తరువాతే టెస్కాబ్ చైర్మన్ స్థానం ఖాళీ అయింది. ఊహించని విధంగా నాకు చైర్మన్ పదవి దక్కింది. దీంతో ఈ పదవితో వరంగల్ రైతులకు సేవ చేయాలనే బాధ్యత మరింత పెరిగింది.

ఆంధ్రజ్యోతి: డీసీసీబీ చైర్మన్‌గా సాధించిన ప్రగతి ఏంటి?

మార్నేని: 2020లో డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నప్పుడు రూ.870కోట్ల టర్నోవర్ మాత్రమే ఉండేది. ఈ నాలుగేళ్ల కాలంలో రూ.1,930.70కోట్లకు బ్యాంకుల లావాదేవీలు పెంచాము. అంతేకాకుండా ఎంపీఏ రేటు 7.5శాతంగా ఉండేది. ప్రస్తుతం 2.99 శాతానికి చేర్చాం. చాలావరకు మొండి బకాయిలను వసూలు చేశాం. కొత్తగా 12 బ్యాంకులను ఏర్పాటు చేశాం. మరో 11బ్యాంకుల ఏర్పాటు కోసం ఆర్‌బీఐకి ప్రతిపాదనలు పంపాం. మొత్తం రూ.1,395.18కోట్ల రుణాలు ఇవ్వగా, ఇందులో వ్యవసాయ రుణాలు రూ.573.73కోట్లు కాగా, వ్యవసాయేతర రుణాలు రూ.822.50కోట్లు ఇచ్చాం. రూ.540.56కోట్ల డిపాజిట్లు సేకరించి రాష్ట్రంలోనే వరంగల్ డీసీసీబీని అగ్రగామిగా నిలబెట్టాం.

ఆంధ్రజ్యోతి: ఎంతమంది రైతులకు వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలిచ్చారు?

మార్నేని: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 70సహకార సంఘాలు ఉండగా, 78,432మంది సభ్యులున్నారు. 32డీసీసీబీ బ్యాంకుల బ్రాంచిలున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు గత డిసెంబరు 9వ తేదీలోపు రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న 78,432మంది రైతులకు రూ.529.44కోట్ల రుణమాఫీ చేయాల్సిందిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అలాగే వ్యవసాయేతరమైన దీర్ఘకాలిక (ఎల్‌టీ), గోల్డ్, ఎస్‌ఏవో, జేఎల్‌జీ, ఎడ్యుకేషన్, హౌసింగ్, వాహనాలు, వ్యక్తిగత తదితర 18రకాలకు పైగా రుణాలకు రూ.1395.18కోట్లు డీసీసీబీ ద్వారా అందించటం జరిగింది. నాబార్డు సహకారంతో ఆత్మ నిర్భర్ అభియాన్ భారత్‌ను అమలు చేస్తున్నాం. దీని ద్వారా రూ.2కోట్ల వరకు రుణాన్ని ఏడేళ్లలో చెల్లించేలా కేవలం 8పైసల వడ్డీకే అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: కొత్తగా బ్యాంకులు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు?

మార్నేని: ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగేళ్ల కాలంలో కొత్తగా 12బ్యాంకులను ఏర్పాటు చేశాం. పర్వతగిరి, పాలకుర్తి, కొడకండ్ల, కేసముద్రం, చిట్యాల, ఏటూరునాగారం, ధర్మసాగర్, ఐనవోలు, మొగిలిచర్ల, తరిగొప్పుల, ములుగు గణపురం, నల్లబెల్లి కేంద్రాల్లో కొత్త బ్రాంచిలను ప్రారంభించాం. అలాగే కురవి, మొగుళ్లపల్లి, దేవురుప్పుల, రఘునాథపల్లి, సంగెం, హసన్‌పర్తి, మంగపేట, గీసుకొండ, నర్సింహులపేట, బచ్చన్నపేట, నెల్లికుదురు తదితర 11ఏరియాల్లో నూతన బ్యాంకుల ఏర్పాటుకు ఆర్‌బీఐకి ప్రతిపాదనలు పంపాం.

ఆంధ్రజ్యోతి: మీ తదుపరి లక్ష్యం ఎమ్మెల్యే సీటుపైనేనా?

మార్నేని: భవిష్యత్ రాజకీయాలపై ఇప్పుడే ఏం చెప్పలేం. ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే ఆలోచన



అయితే లేదు. కానీ, మూడు దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఎలాంటి మచ్చ లేకుండా కొనసాగుతున్నా. పీఏసీఎస్ చైర్మన్‌గా, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా, డీసీసీబీ చైర్మన్‌గా, ప్రస్తుతం టెస్కాబ్ చైర్మన్‌గా పని చేస్తున్నాను. ఏ పదవిలో ఉన్నా ప్రజల సమస్యలను పరిష్కరించటం పైనే మొదటి ప్రాధాన్యం ఉంటుంది. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఓరుగల్లు రైతులకు మేలు జరిగేలా ప్రత్యేకంగా దృష్టి పెట్టి పని చేస్తున్నా.

ఆర్థిక ఇబ్బందుల్లో నర్సులు

ఎంజీఎంలో వేతనాలు రాక రెగ్యులర్ నర్సుల అవస్థలు

వరంగల్ మెడికల్, జూన్ 20: ఎంజీఎం ఆస్పత్రిలో కొన్ని నెలల కిందట రెగ్యులర్ ప్రాతిపదికన నియామకమైన 127 మంది నర్సింగ్ ఆఫీసర్లు ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఐదు నెలల కిందట రాష్ట్రవ్యాప్తంగా బోధన ఆస్పత్రుల్లో నర్సింగ్ ఆఫీసర్ల నియామకమయ్యారు. ఇందులో 127మంది నర్సింగ్ ఆఫీసర్లు రెగ్యులర్ పద్ధతిలో ఎంజీఎంకు కేటాయించబడ్డారు. అయితే వీరికి ఎంప్లాయ్ ఐడీ, సీపీఎస్ నెంబరు కోసం ఎంజీఎం నుంచి ఖజానా కార్యాలయానికి పంపించాల్సి ఉంది. కానీ కొందరి నిర్లక్ష్యం వల్ల ఇంతకాలంగా జీతాలు అవడం లేదని వాపోతున్నారు.

కేఎంసీలో వేతనాల రికవరీ

కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఆఫీసర్ల జీతాల్లో కోత విధిస్తామని అధికారులకు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మూడు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా 138 మంది 2021 జూన్ 13వ తేదీన నియామకం అయ్యారు. వీరికి ప్రతీ నెల రూ. 25,140 జీతంగా చెల్లించారు. ఆ తరువాత 2022వ సంవత్సరం నుంచి 30శాతం జీతం పెరిగిందని, ప్రతీ నెల రూ.32వేలు జీతం చెల్లించారు. అయితే ఇంతకాలం చెల్లించాక పెరిగిన జీతం మీకు వర్తించదని పేర్కొంటూ ప్రతీ ఒక్క కాంట్రాక్టు నర్సింగ్ ఆఫీసర్ రూ.84 వేలు చెల్లించాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఇది కూడా ప్రతీ నెల జీతంలో రికవరీ చేస్తామని కేఎంసీ అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కాంట్రాక్ట్ నర్సింగ్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ మాట్లాడితే ఉద్యోగాలు తీసేస్తామని బెదిరిస్తున్నారని వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.650 కోట్ల బల్దియా బడ్జెట్‌కు ఆమోదం

సమష్టి కృషితో నగరాన్ని అభివృద్ధి చేస్తాం : మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 20: వరంగల్ నగర పాలక సంస్థ 2024-25 సంవత్సరానికి ముసాయిదా బడ్జెట్ అంచనాల మేరకు మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన పాలక మండలి ఆమోదించింది. ఈ సమావేశంలో 1/3 కోరం సభ్యులు హాజరైన తర్వాత బల్దియా అకౌంట్స్ పర్యవేక్షణాధికారి సరిత బడ్జెట్ అంచనాలను వెల్లడించారు. రూ.650.12కోట్ల అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌కు మెజారిటీ సభ్యులు చేతులెత్తి అంగీకారం తెలుపడంతో పాలకవర్గం బడ్జెట్‌ను అమోదించింది. ఇందులో రూ.237.02 కోట్లు సాధారణపన్నుల ద్వారా, రూ.410.10 కోట్లు వివిధ గ్రాంట్ల ద్వారా ఆదాయం సమకూరుతుందని అవచనా వేశారు.

ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మునిపిపల్ పట్టణ అభివృద్ధి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్ల సహకారంతో గ్రేటర్ వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. తాను మేయర్‌గా కొలువుదీరిన తర్వాత 2024-25 బడ్జెట్‌ను కలుపుకుని మూడోసారి బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించామన్నారు. ఈయేడు బడ్జెట్‌లో ప్రజలపై ఎక్కువ పన్నుల భారం మోపకుండా బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ బడ్జెట్ గ్రేటర్ 66 డివిజన్‌ల అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. ప్రధానంగా విలీనగ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పోచంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, డిప్యూటీ మేయర్‌తో పాటు వివిధ పార్టీల కార్పొరేటర్లు, ఎక్స్ ఎఫీషియో సభ్యులు పాల్గొన్నారు.

బల్దియా ఆదాయం

ట్యాక్స్ రెవెన్యూ	రూ.8,98కోట్లు
అసైన్డ్ రెవెన్యూ కంపన్‌సేషన్	------------
మున్సిపల్ ఆస్తుల అద్దెలు	రూ.12,66కోట్లు
టౌన్ ప్లానింగ్	రూ. 86,04కోట్లు
శానిటేషన్	రూ.18,97కోట్లు
ఇంజనీరింగ్	రూ.29,55కోట్లు
మొత్తం	రూ. 237,02కోట్లు

ఖర్చులు

సిబ్బందికి జీత భత్యాలు	రూ.80కోట్లు
పారిశుద్ధ్య నిర్వాహణకు	రూ.25,80కోట్లు
విద్యుత్ చెల్లింపులు	రూ.18,45కోట్లు
గ్రీన్ బడ్జెట్ 10 శాతం	రూ. 23,70కోట్లు
ఇంజనీరింగ్ విభాగానికి	రూ. 25,75కోట్లు
సాదారణ నిర్వాహణకు	రూ. 18,50కోట్లు
టౌన్ ప్లానింగ్	రూ. 1.20కోట్లు
డీఆర్‌ఎఫ్	రూ. 1.50కోట్లు
విలీన గ్రామాల అభివృద్ధికి	రూ. 14,04కోట్లు
ప్రజాసౌకర్యాల కల్పన	రూ. 5,20కోట్లు
వార్డుల అత్యవసర అభివృద్ధికి	రూ. 22,88కోట్లు

అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

వరంగల్ లీగల్, జూన్ 20: పదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 యేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ఫోక్సో ప్రత్యేక కోర్టు కం మొదటి అదనపు సెషన్స్ జడ్జి బి.అపర్ణాదేవి గురువారం తీర్పు చెప్పారు. అదేవిధంగా బాధిత బాలికకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హనుమకొండ కమలాపూర్ మండలం గునిపర్తి గ్రామానికి చెందిన ముత్యాల హన్మంతు 2017 సెప్టెంబరు 13న మధ్యాహ్నం 2 గంటలకు దివ్యాంగుల పాఠశాలలో చదువుతున్న ఓ బాలిక ఆడుకుంటుండగా ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో బాలిక అస్వస్థతకు గురికావడంతో తల్లి విషయం తెలుసుకున్నది. హన్మంతు బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు హన్మంతుపై ఫోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి 20 ఏళ్ల కారాగార శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎం.హరీష్ విక్రమ్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారులుగా సీఐలు సతీష్‌చందర్‌రావు, ఇ.హరికృష్ణ వ్యవహరించారు. కోర్టు లైజన్ అధికారిగా కె.పరమేశ్వరి, భరోసా లీగల్ అధికారి సీహెచ్. నీరజ కేసులో సహకరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

బాలికను బెదిరించిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు

వరంగల్ లీగల్, జూన్ 20: ప్రేమించమని, లేదంటే చంపుతానని బాలికను బెదిరించిన కేసులో మారెపెల్లి అనురుద్‌కు రెండేళ్ల కారాగార శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ఫోక్సో ప్రత్యేక కోర్టు కం మొదటి అదనపు సెషన్స్ జడ్జి బి.అపర్ణాదేవి గురువారం తీర్పు చెప్పారు. అదే విధంగా బాధిత బాలికకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన మారెపెల్లి అనురుధ్ 14 యేళ్ల బాలికను 2019 ఆగస్టు 9న ఉదయం 10.30 గంటలకు తన ఇంటి వెనకాల రాగానే అకస్మాత్తుగా బాలిక వద్దకు వచ్చి నోరు మూశాడు. తనను ప్రేమించాలని, లేదంటే బాలికను, ఆమె కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరించాడు. దీంతో బాలిక విషయం తల్లిదండ్రులకు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు.

కేసు విచారణంలో నేరం రుజువైనందున నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అదే విధంగా అంతకుముందు 2019 జనవరి 17న సాయంత్రం 6 గంటలకు బాలిక ఇంటి ముందుకు వచ్చి తనను ప్రేమించాలని, లేదంటే చంపుతానని బెదిరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులోకూడా రెండేళ్ల జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అదే విధంగా రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. కాగా, ఈ రెండు కేసుల్లో విధించిన శిక్ష ఏకకాలంలో అనుభవించాల్సిందిగా న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. కోర్టు పీసీ ఎ.రవి, సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారిగా ఎస్సై జి.రాజ్‌కుమార్ వ్యవహరించారు. కోర్టు లైజన్ అధికారిగా కె.పరమేశ్వరి, భరోసా లీగల్ అధికారి సీహెచ్. నీరజ కేసులో సహకరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

బదిలీల ప్రక్రియకు కసరత్తు ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 20: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా బదిలీలకు రెండు జిల్లాల విద్యాశాఖలు రంగం సిద్ధం చేస్తున్నాయి. గురువారం రెండు డీఈవో కార్యాలయాల్లో డీఈవోలు సంబంధిత సిబ్బందిని బదిలీల ప్రక్రియను వేగవంతం చేయాలని, ఖాళీలను గుర్తించి జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయులను బదిలీ చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. వరంగల్ జిల్లాలో సుమారుగా 556 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఇక హనుమకొండ జిల్లాలో 452 మంది ఉపాధ్యాయులు బదిలీలు అయ్యే అవకాశం ఉంది.



బదిలీల ప్రక్రియ కసరత్తు చేస్తున్న డీఈవో అబ్దుల్‌హై

స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్, జూన్ 20: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ (సెల్ట్) నేతృత్వంలో 40 రోజుల పాటు నిర్వహించే స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ తరగతులకు దరఖాస్తులు చేసుకోవాలని డైరెక్టర్ డాక్టర్ ఆర్.మేఘనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 10 నుంచి క్లాస్‌లు నిర్వహిస్తామని, జూలై 9 వరకు వర్సిటీ విద్యార్థులు ఉద్యోగులు రూ.వెయ్యి, ఇతరులు రూ.15 వందల చొప్పున క్యాంపస్ ప్రిన్సిపాల్ కార్యాలయంలో చెల్లించుకుని దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

రేపు కేయూలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సమావేశం

కేయూ క్యాంపస్, జూన్ 20: ఈనెల 22న శనివారం ఉదయం 10.30 గంటలకు కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశం సెనెట్‌హాల్‌లో ఏర్పాటు చేసినట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 అల్మానాక్, కళాశాలల అనుబంధాలు, పరీక్షల షెడ్యూల్, స్పోర్ట్స్, గేమ్స్, ఎన్‌ఎస్‌ఎస్‌తో పాటు ఇతర అంశాలపై చర్చిస్తామని వెల్లడించారు. సంబంధిత డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ విధిగా హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్

కేయూ క్యాంపస్, జూన్ 20: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల్లో ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాస్తుండగా పరీక్షల తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్. నరేందర్‌లు మంగళవారం తెలిపారు. డీబారైన వారిలో నల్లగొండ ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఒక్కరు ఉన్నట్లు పేర్కొన్నారు. వారిపై పోలీసు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళలకు ఆర్టీసీ శుభవార్త

డీలక్స్ బస్సులో ప్రయాణిస్తే డ్రాలో బహుమతులు

బాలసముద్రం, జూన్ 20: ఆర్టీసీ డిలక్స్ బస్సులో ఉప్పల్ క్రాస్‌రోడ్-హైదరాబాద్ రూట్లలో ప్రయాణించే మహిళ ప్రయాణికులు టికెట్ పై డ్రా తీసి బహుమతులు ఇవ్వనున్నట్లు హనుమకొండ డిపో మేనేజర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ వెనుక తమ పేరు, ఫోన్ నెంబరు రాసి డ్రైవర్ పక్కన ఉండే లక్కీ డ్రా బాక్స్‌లో వేయాలని తెలిపారు. నెలలో రెండు సార్లు డ్రా తీసి ముగ్గురు మహిళలకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు డిలక్స్ బస్సుల్లో ప్రయాణించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో తెలిపారు.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

జనగామ కల్చరల్, జూన్ 20: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న వేడుకలు నిర్వహిస్తున్నట్లు భజరంగ్ యోగా సంస్థాన్ సంస్థాపకులు, యోగా ట్రైనర్ గీతేష్ బజాజ్ తెలిపారు. జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో ఉదయం 5.45 నుంచి 7గంటల వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యాభిలాషులందరూ కుటుంబ సభ్యులతో హాజరు కావాలని ఆయన కోరారు.

కేజీబీవీ ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలి

జనగామ కల్చరల్, జూన్ 20 : అక్రమాలకు పాల్పడ్డ స్టేషన్‌ఘన్‌పూర్ కేజీబీవీ ఎస్‌వోపై అధికారులు చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఈవో కార్యాలయంలో ఏడీకి వినతిపత్రం అందించారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో ఉన్న మోడల్ హాస్టల్‌కు ఇన్‌చార్జ్‌గా ఆమెను నియమిస్తే అక్కడ పంపిన బిల్లును తమ కేజీబీవీకి వాడుకోవడం సరికాదన్నారు. ఇలాంటి అవినీతి మరెక్కడా జరుగకుండా ఎస్‌వో స్వప్నపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు యాకన్న, రాథోడ్, సుమ, అర్జున్, లవకుమార్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న శంకర్ తదితరులు

జనగామ కల్చరల్, జూన్ 20: తండాల అభివృద్ధి బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ప్రత్యేక ఎస్టీ కమిషన్ నియమించి ట్రైబల్ అడ్వయిజర్ కమిటీ ఏర్పాటు చేయాలని, మైదాన ప్రాంత గిరిజనులకు ప్రత్యేక ఐటీడీఏను ఏర్పాటు చేయాలన్నారు. 10శాతం రిజర్వేషన్ జీవో 33కి రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల దందాలను అరికట్టాలని, విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీల్లో వెనుకబడిన కుటుంబాల్లో 25శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బానోతు మహేందర్, భూక్య రాజు, అశోక్‌సుమన్, రాజన్న పాల్గొన్నారు.

డీసీపీని కలిసిన మైనారిటీ నాయకులు

జనగామ కల్చరల్, జూన్ 20: ఇటీవల విధుల్లో చేరిన జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌ను జిల్లా మైనారిటీ నాయకులు కలుసుకున్నారు. గురువారం జనగామ పట్టణ మైనారిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజహరుద్దీన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

నీరుగారుతున్న ప్రభుత్వ ఆశయం


చిలుపూర్‌లో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు


తీగలతండాలో వినియోగంలోకి రాని శ్మశానవాటిక

- నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు
- వినియోగంలోకి రాక ప్రజల అవస్థలు
- దెబ్బతిన్న గోడలు, ఫ్లోరింగ్.. పట్టించుకోని అధికారులు

చిలుపూర్, జూన్ 20 : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని 'పల్లెప్రగతి' పేరుతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు నేడు వినియోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరి దర్శనమిస్తున్నాయి. ఇళ్లల్లో నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి సేంద్రీయ ఎరువులను తయారు చేయాలన్న గత ప్రభుత్వ లక్ష్యానికి ఆదిలోనే అడ్డంకులు ఎదురయ్యాయి. సేంద్రీయ ఎరువుల తయారీ కోసం ఒక్కో గ్రామంలో రూ.3 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రేకుల షెడ్డు, రెండు తొట్లతో పాటు, దాని పక్కనే మరుగుదొడ్డి నిర్మించారు. మొదట్లో కాస్తా వాటిని వినియోగించి ఎరువులను సైతం తయారు చేశారు. క్రమేపీ వాటిని వినియోగించడం మానేశారు. దీంతో అవి నేడు శిథిలావస్థకు చేరి అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.

మరోవైపు కొన్నిచోట్ల దహన సంస్కారాలకు సైతం స్థలం అందుబాటులో లేదన్న కారణంతో గత ప్రభుత్వం రూ.14 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో వైకుంఠధామాల(శ్మశానవాటిక) నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. నేటికీ అక్కడక్కడా నిర్మాణాలు పూర్తికాకపోవడం, పూర్తయిన చోట ఊరికి దూరంగా ఉండి వినియోగంలోకి రాకపోవడం తదితర కారణాల వల్ల చివరి మజిలీకి సైతం ప్రజలకు కష్టాలు తప్పడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఆయా సందర్భాల్లో నేటికీ వాగులు, వంకలతో పాటు, ప్రభుత్వ స్థలాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించి సెగ్రిగేషన్ షెడ్లతో పాటు వైకుంఠధామాలను సైతం వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు దృష్టి సారించాలి

నారగోని రాజుగౌడ్, చిలుపూర్ గుట్ట



లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లతో పాటు వైకుంఠధామాలు (శ్మశానవాటికలు) వినియోగంలోకి రాకపోవడం బాధాకరం. జనావాసాల్లోంచి సేకరించిన తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి సేంద్రీయ ఎరువులను తయారు చేయడం మాని, దానిని డంపింగ్ యార్డుకు తరలించడం సరికాదు. నిర్వహణపై దృష్టి పెట్టాల్సిన పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం తగదు. ఈ విషయంలో కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి బాధ్యులపై చర్యలు చేపట్టాలి.

సమస్యలపై దృష్టి సారిస్తాం..

మొగులప్ప, డీఆర్డీవో, జనగామ



సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాల (శ్మశానవాటిక) నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. కొన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సిబ్బంది కొరత కారణంగా వాటి నిర్వహణ సాగడం లేదు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సేంద్రీయ ఎరువులను తయారు చేయడం, వైకుంఠధామాలను సైతం వినియోగించే విధంగా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత మండలాల ఎంపీడీవో, ఎంపీవోలను ఆదేశించాం.

రేపు క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికలు

జనగామ కల్చరల్, జూన్ 20: హకీంపేట క్రీడా పాఠశాలలో చేరేందుకు ఈ నెల 22న ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జనగామ మండల నోడల్ అధికారి వంగాల రాజేందర్ గురువారం తెలిపారు. ఈ మేరకు గురువారం జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసక్తి గల విద్యార్థులు పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు 4వ తరగతి చదువుతూ 01-09-2015 నుంచి 31-08-2016 మధ్యలో జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికలకు వచ్చే అభ్యర్థులు జనన ధృవీకరణ పత్రం, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, నీళ్ల సీసా, మధ్యాహ్నభోజనం వెంట తీసుకొని రావాలన్నారు. సమావేశంలో మండల వ్యాయామ దర్శకులు పోగుల నరేందర్‌గౌడ్, మంగళంపల్లి రవికుమార్, జనార్దన్, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైలు కిందపడి వ్యక్తి మృతి

రఘునాథపల్లి, జూన్ 20 : రఘునాథపల్లి రైల్వేస్టేషన్ రెండవ ప్లాట్‌ఫారం వద్ద గురువారం ప్రమాదవశాత్తు ఓ గుర్తు తెలియని వ్యక్తి(30) యశ్వంతపూర్-గోరఖ్‌పూర్ రైలు కిందపడి మృతి చెందాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేష్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జనగామ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ సందర్భంగా జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి మాట్లాడుతూ మృతుడి కుడి చేతిపై చమన్‌లాల్ అని పచ్చబొట్టు, ఛాతిపై కుడివైపు పుట్టుమచ్చ ఉందని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు జనగామ రైల్వే పోలీసుకు సంబంధించిన 8121708796, 9010100958 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి : సీపీఎం


సమావేశంలో మాట్లాడుతున్న కనకారెడ్డి

బచ్చన్నపేట, జూన్ 20: మండలంలోని చిన్నరామన్‌చెర్ల గ్రామ శివారులో గల 174 సర్వే నెంబరుకు సంబంధించిన ప్రభుత్వ భూమిని అధికారులు వెంటనే స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని గోపాల్‌నగర్ వద్ద గురువారం జరిగిన గుడిసెవాసుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ భూములను రక్షించాలని అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని కోరారు. ప్రభుత్వం పేదల పక్షమో, కబ్జాదారుల పక్షమో తేల్చుకోవాలన్నారు. సమావేశంలో పర్వతం నర్సింహులు, బూడిద గోపి, చుంచు విజేందర్, బెల్లంకొండ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పట్టాలపై విచారణ జరిపించండి

- ఆర్డీవోను ఆదేశించిన ఎమ్మెల్యే కడియం

చిలుపూర్, జూన్ 20 : మండలంలోని శ్రీపతిపల్లిలో నెలకొన్న సీలింగ్ భూముల అక్రమ పట్టాల సమస్యపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆర్డీవో డీఎస్.వెంకన్నను ఆదేశించారు. గురువారం స్థానిక నాయకులు రంగు రమేష్, మాలోతు రాజు నాయక్, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు పోలబోయిన నరేష్ నేతృత్వంలో బాధిత రైతులు చేర్యాల పోశయ్య, నీల చిన్న వెంకటయ్య, సాయమ్మ, కనకమ్మ తదితరులు హనుమకొండలో ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి సమస్యను విన్నవించారు. 1990-91లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కుటుంబానికి 1 ఎకరం చొప్పున గ్రామ రెవెన్యూ సర్వేనంబర్ 63, 69లో పంపిణీ చేయడంతో పాటు పట్టాలను సైతం అందజేసిందని తెలిపారు. తమకు కేటాయించిన భూమిని ఇటీవల రాజకీయ నాయకుల అండదండలతో సమీప రైతులు అక్రమంగా పట్టా చేసుకోవడంతో పాటు, బలవంతంగా కబ్జాకు సైతం దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యను విన్న ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్రమ పట్టాల విషయమై తక్షణమే విచారణ చేపట్టి పేద రైతులకు న్యాయం చేయాలని ఆర్డీవోను ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామస్థులు మోతె మహేశ్, పల్లపు కనకయ్య, రాజ్‌కుమార్, కరుణాకర్, మోతె ఉపేందర్, పిట్టల వెంకన్న, మాలోతు జంపరాజు, తుపాకుల శంకర్, సురేశ్, రవి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్యకు సమస్యను వివరిస్తున్న శ్రీపతిపల్లి భూ బాధితులు

ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన మాజీ సర్పంచులు

వరంగల్ ఎంపీగా ఎన్నికైన డాక్టర్ కడియం కావ్యతో పాటు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలనందజేశారు. వంగాలపల్లి, చిన్నపెండ్యాల, వెంకటాద్రిపేట మాజీ సర్పంచులు భూక్య సుధాకర్‌నాయక్, తాళ్లపల్లి సమ్మయ్య, చల్లా రాజ మహేందర్‌రెడ్డి నేతృత్వంలో ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులంతా నేతలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తమ గ్రామాల సమగ్రాభివృద్ధికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బత్తుల సూర్యనారాయణ, చింత దాసు, నాగరబోయిన శ్రీరాములు, రమేష్, నరేందర్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


వెంకటయ్య మృతదేహం

రఘునాథపల్లి, జూన్ 20 : మండలంలోని అశ్వరావుపల్లిలో కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముప్పిడి వెంకటయ్య(45) మూడు రోజుల క్రితం భార్య సునీతతో గొడవ పడగా, అదేరోజు ఆమె బంధువుల ఇంటికి వెళ్లింది. మూడు రోజులైనా భార్య ఇంటికి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వెంకటయ్య ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందాడు. ఆయనకు కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురుకు వివాహం కాగా, కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

నులి పురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలి

- నులి పురుగుల నివారణ దినోత్సవంలో ఆర్డీవో వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూన్ 20: విద్యార్థులు ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అందిస్తున్న నులి పురుగుల నివారణ మాత్రలు(అల్బెండజోల్) తప్పక వేసుకోవాలని ఆర్డీవో వెంకన్న కోరారు. గురువారం స్థానిక సంక్షేమ గురుకులంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చేపట్టిన మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆర్డీవో ప్రారంభించి మాట్లాడారు. మట్టిలో ఆడినప్పుడు చేతులు సరిగా శుభ్రం చేసుకోకుండా ఆహారం తీసుకుంటే కడుపులో నులి పురుగులు పెరుగుతాయన్నారు. వాటి వల్ల తిన్న ఆహారం శరీరానికి నులి పురుగులు దక్కకుండా చేస్తాయన్నారు. తద్వారా పిల్లల్లో రక్త హీనత, బలహీనత పెరుగుతూ నీరసంగా తయారవుతారన్నారు. అందుకే ప్రభుత్వం ఏటా రెండు సార్లు 1 నుంచి 19 ఏళ్ల వారికి ఈ మాత్రలు పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. ఈ రోజు 89 శాతం మందికి మాత్రలు అందించారన్నారు. మిగతా వారికి ఈనెల 27న ఇస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్, ప్రిన్సిపాల్ కాళహస్తి, ఎంవో డాక్టర్ జనార్దన్, డాక్టర్ ప్రసన్న కృష్ణ, సీహెచ్‌వో సాంబయ్య, కృష్ణ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

- స్టేషన్‌ఘన్‌పూర్ : డివిజన్ కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని జడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి ప్రారంభించారు. చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సింగపురం దయాకర్, ఉపాధ్యాయులు చందర్, మాలతి, రాము, రమేష్, తదితరులు పాల్గొన్నారు.
- జనగామ కల్చరల్ : జనగామ జిల్లా కేంద్రంలోని సత్రం కాలనీలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సత్రం కాలనీలోని అంగన్‌వాడీ స్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అనిత, అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత, ఆశా వర్కర్ సంధ్య, ఆయా లక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.
- జనగామ రూరల్ : జనగామ మండలం శామీర్‌పేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎంపీపీ మేకల కళింగరాజు నులి పురుగులమాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నులి పురుగుల వలన పౌష్టికాహార లోపం, కడుపు నొప్పి, విరోచనలు, రక్తహీనత ఏర్పడుతుందని, తల్లిదండ్రులు పిల్లల ఎదుగుదల కోసం తప్పకుండా మాత్రలు వేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, హెచ్ఎం సుధీర్‌రెడ్డి, సూపర్వైజర్ ఎల్ రాణి తదితరులు పాల్గొన్నారు.
- బచ్చన్నపేట : మండలంలోని కొడవటూరు పాఠశాలలో డీవార్మింగ్ డే నిర్వహించారు. విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు అందించి వాటి వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రూపాచైతన్య వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.
- రఘునాథపల్లి : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు కోమల్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోమల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి మధుకర్, వైద్యసిబ్బంది ప్రమీల, ప్రభాకర్, జిలానీ, మనోహర్, రజిత, ఆశ వర్కర్లు భాగ్య, సంపూర్ణ, హేమలత తదితరులు పాల్గొన్నారు.
- చిలుపూర్ : మండలంలోని మల్కాపూర్, రాజవరం తదితర గ్రామాల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మల్కాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కుషాలి మాట్లాడుతూ ఏదేని కారణాల వల్ల మాత్రలు వేసుకోని వారు ఈ నెల 27న గ్రామాల్లో ఉన్న సబ్ సెంటర్లలో ఏఎన్ఎంలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయ, మంజులరాణి, ఏఎన్ఎంలు సంతోష, సబిత, అంగన్‌వాడీలు మంతెన విజయరాణి, వాణి స్వర్ణ వీణ, రజిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.
- కొడకండ్ల : మండలంలో నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల వైద్యాధికారి హరికృష్ణ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంజయ్య, ఎంపీటీసీలు అందె యాకయ్య, కుందూరు విజయలక్ష్మి, వైద్యులు పేరం విజయవర్షిణి, ఎం.స్నేహలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరళ, టీచర్లు, పంచాయతీ సెక్రటరీ గంటా శ్రీనివాస్, ఆశా వర్కర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- లింగాలఘణపురం : మండలంలోని అన్ని గ్రామాల్లో నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అల్బెండజోల్ మాత్రలను మండల వైద్యాధికారి కరుణాకర్‌రాజు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రత్యేకంగా నట్టల నివారణ మందులను వేసిన వైద్య సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను వివరించారు.
- పాలకుర్తి : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. పాలకుర్తిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ నాగిరెడ్డి, జడ్పీటీసీ శ్రీనివాసరావు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండి.మదార్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ లక్ష్మి, నవీన తదితరులు పాల్గొన్నారు.
- దేవరుప్పుల : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో నులి పురుగుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. మండల వైద్యశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలతో పాటు గ్రామాల్లో 01-19 సంవత్సరాల పిల్లలకు సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. సీతారాంపురంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ బస్వ సావిత్రి హాజరై చిన్నారులకు మాత్రలు వేశారు. కస్తూర్బా గిరిజన ఆశ్రమ పాఠశాలలో మండల వైద్యాధికారిరవితేజ పాల్గొని విద్యార్థులకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటస్వామి, ఏఎన్ఎం వసంత, సరిత, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనాథ్, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ఆశాలు పాల్గొన్నారు.
- జఫర్‌గడ్ : మండలంలోని పిల్లలకు వైద్యశాఖ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రలను వేశారు. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో ప్రభుత్వ ఆసుప్రతి వైద్యాధికారి డాక్టర్ విష్ణు సమక్షంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, తహసీల్దార్ అంబటి అంజనేయులు విద్యార్థులకు నట్టల నివారణ మాత్రలను అందించి ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను వేయించినట్లు జఫర్‌గడ్, కూనూరు ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులు విష్ణు, రాజమౌళి తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


స్టేషన్‌ఘన్‌పూర్ సంక్షేమ గురుకులంలో డీవార్మింగ్ మాత్రల పంపిణీని ప్రారంభిస్తున్న ఆర్డీవో వెంకన్న


శామీర్‌పేటలో అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీపీ కళింగరాజు


పాలకుర్తి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మదార్

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం


ధర్మాపురం పీఎస్‌లో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న కామారెడ్డిగూడెం కాంప్లెక్స్ హెడ్మాస్టర్ రాజేంద్రకుమార్

దేవరుప్పుల, జూన్ 20: మండలంలోని ధర్మాపురం ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కామారెడ్డిగూడెం కాంప్లెక్స్ హెచ్ఎం రాజేంద్రకుమార్ హాజరై విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అక్షరాభ్యాసం నిర్వహించడం ఒక మంచి సంప్రదాయమని కొనియాడారు. విద్యార్థులు చక్కగా చదువుకొని భవిష్యత్‌లో మంచి పౌరులుగా రాణించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మాపురం ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీశివాణి, పీఎస్ హెచ్ఎం ముడిదె రాము, ఉపాధ్యాయులు చల్లా విజయ్‌పాల్‌రెడ్డి, సరిత, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే పరిశీలన

పాలకుర్తి, జూన్ 20 : మండల కేంద్రంలో చేపడుతున్న మిషన్ భగీరథ సర్వేను ఎంపీడీవో రాములు గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 36 గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు ఇంటింటికి అందుతుందా.. సరఫరా చేయకుంటే తిరిగి నల్లాలు వేసేందుకు సర్వే చేపట్టి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 32 గ్రామాల్లో సర్వే పూర్తికాగా, 4 గ్రామాల్లో ఇంకా పూర్తికాలేదని అన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కపిలవాయి వెంకటాచారి తదితరులు ఉన్నారు.

తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 20: తెలంగాణలో రానున్న రోజుల్లో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మోటం శ్రీనివాస్ అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో గురువారం ఆయన మాట్లాడారు. ఆంధ్రాలో అవినీతి సీఎంను అక్కడి ప్రజలు గద్దె దించారన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు నాల్గవసారి సీఎం కావడం అభినందనీయమన్నారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్రంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందన్నారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు మాదిరెడ్డి ధర్మారెడ్డి, ఎస్సీసెల్ జిల్లా నాయకుడు మోహన్, కలకోల రమేష్, ఎల్లగౌడ్ పాల్గొన్నారు.

రూ.2.50 లక్షల ఎల్‌వోసీ అందించిన కడియం

జఫర్‌గడ్, జూన్ 20 : మండలంలోని తమ్మడపల్లి(ఐ)కి చెందిన నాగపురి సాంబకుమార్ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య ఖర్చుల కోసం రూ.2.50 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని గురువారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందజేశారు. పేద కుటుంబానికి చెందిన సాంబకుమార్ నరాల వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. చికిత్సకు భారీగా ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఎమ్మెల్యేను ఆర్థిక సాయం కోసం అర్థించగా స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ కింద అత్యవసర వైద్య చికిత్స కోసం రూ.2.50 లక్షలు మంజూరు చేయించారు. మంజూరైన ఎల్‌వోసీ పత్రాన్ని గురువారం హనుమకొండలోని తన నివాసంలో స్థానిక నాయకుడు గాదె సుధాకర్‌బాబు సమక్షంలో ఎమ్మెల్యే బాధిత కుటుంబీకులకు అందించారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

రఘునాథపల్లి : మండలంలో పలువురు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం పరామర్శించారు. ఖాంజీపేటలో కాంగ్రెస్ నాయకుడు గొరిగె భిక్షపతి మృతి చెందగా పార్థివదేహానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఇటీవల గ్రామంలో మృతి చెందిన చెరుకు గౌరయ్య, కన్న సుధాకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రఘునాథపల్లిలో మృతి చెందిన పేర్ని జ్యోతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి, మారజోడు రాంబాబు, కోళ్ల రవిగౌడ్, గాదె మహేందర్‌రెడ్డి, మల్కాపురం లక్ష్మయ్య, కడారి రవి తదితరులు పాల్గొన్నారు.